
www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 14 ఆగస్టు 2025
5
తిరుపతి



స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు మంత్రికి ఆహ్వానం

మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని ఆహ్వానించిన శ్రీకాళహస్తి ఆర్డిఓ భానుప్రకాష్ రెడ్డి



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఆగస్టు 15న తిరుపతి జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరగబోయే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాక ఆవిష్కరణ చేసి, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించేందుకు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భాను ప్రకాష్ రెడ్డి, మంత్రి ఆనంకి అధికారిక ఆహ్వాన పత్రికను అందజేశారు. మంత్రి ఆనం ఆహ్వానం స్వీకరిస్తూ, స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి, దేశభక్తి భావాలను ప్రజల్లో మరింతగా నింపేలా ఈ వేడుకలు జరుగుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

నియోలింక్ 'నిరంకుశత్వం'

- వేతనాల్లో కోత
- విరామం లేకుండా విధులు
- తిరగబడ్డ కార్మికులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తిరుపతి-రేణిగుంట పారిశ్రామిక వాడ పరిధిలోని నియోలింక్ ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమ కార్మికుల పట్ల నిరంకుశ వైఖరిని అవలంబిస్తోంది. ఓటీలు, రిడక్షన్ల పేరిట కార్మికుల వేతనాల్లో కోత పెడుతోంది. కార్మిక చట్టాలకు విరుద్ధంగా కార్మికుల చేత విరామం లేకుండా పనులు చేయించు కుంటోంది. మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను ఆసరాగా చేసుకుని కార్మికుల చేత వెట్టిచాకిరీ చేయిస్తోంది. మహిళా కార్మికుల పట్ల కనికరం లేకుండా మూడు షిఫ్టులలో 12 గంటలు పని చేయించుకుంటూ శ్రమదోపిడికి పాల్పడు తోంది. ఈ క్రమంలో నియో లింక్ యాజమాన్య నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా బుధవారం కార్మికులు తిరగబడ్డారు. మంగళవారం రాత్రి సి-షిఫ్ట్‌కు హాజరైన కార్మికులు, బుధవారం ఏ-షిఫ్టుకు హాజరైన కార్మికులు ఒక్కసారిగా రోడ్లపైకి వచ్చి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ తమ చేత 12 గంటలు పని చేయించుకుంటూ కనీస మౌలిక వసతుల కల్పనలో యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. సుమారు 2500 మంది పనిచేస్తున్న పరిశ్రమలో సరిపడా పారిశుద్ధ సిబ్బంది లేరనీ, కేవలం నాలుగు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయని వాపోయారు. మారిన లేబర్ కోడ్ల ప్రకారం నెలకు(12 గంటల పని విధానం) 24 వేలు కనీస వేతనం చెల్లించాల్సి ఉండగా, జూలై నెలకు యాజమాన్యం కేవలం రూ.15 వేలు మాత్రమే చెల్లించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక గంట పని విరామం నిబంధన ఉన్నా అర్ధగంట మాత్రమే సమయం ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్ధగంట దాటితే ఐడి కార్డులను లాక్కొని, దుర్భాషలాడుతూ బయట నిలబెడుతున్నారని వాపోయారు. గతంలో క్యాంటీన్, బస్సు రవాణా ఖర్చులు యాజమాన్యం ఉచితంగా అందిస్తుండగా ప్రస్తుతం రిడక్షన్ల పేరిట మా కష్టంలో కోత పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో సెక్యూరిటీ సిబ్బంది కార్మికులను అదుపు చేసే క్రమంలో దురుసుగా ప్రవర్తించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న యాజమాన్యం సాంకేతిక లోపం కారణంగా వేతనాల్లో కోత పడిందనీ, సాయంత్రంలోగా లోపాన్ని సరిదిద్దుకుంటామం టూ హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు.







కలెక్టర్ దృష్టి సారించాలి: పెనగడం గురవయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి



ఉపాధి పేరుతో పరిశ్రమలు స్థాపిస్తున్న కార్పొరేట్ యాజమాన్యాలు శ్రామికుల శ్రమను దోచుకుంటున్నాయి. చెప్పిందొకటి..చేసేది ఒకటిగా వ్యవహరిస్తున్నాయి. కార్మిక చట్టాలకు తిలోదకాలి చ్చి ఇష్టానుసారం వ్యవహరిస్తు న్నాయి. కార్మికుల చేత గొడ్డు చాకిరీ చేయించుకుని అరకొర వేతనం చెల్లిం చిన నియోలింక్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి. జిల్లా కలెక్టర్ పరిశ్రమలపై దృష్టి సారించాలి.

కాలువల్లో ఎప్పటికప్పుడు సిల్ట్ తొలగించండి



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: నగరంలోని అన్ని కాలువల్లో ఎప్పటికప్పుడు సిల్ట్ (చెత్త, పేరుకుపోయిన మట్టి) ఎప్పటికప్పుడు తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం ఎల్.ఐ.సి. రోడ్డు, ఆఫీసర్ క్లబ్, రామకృష్ణాపురం, హమీద్ నగర్, మంచినీళ్ల కుంట తదితర ప్రాంతాలను అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రెయినేజీ కాలువలు లీక్ అవుతున్నాయని, వర్షపు నీరు ఆగుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లోని కాలువల్లో ఎప్పటికప్పుడు సిల్ట్ తొలగించి మురుగునీరు సజావుగా వెళ్లేలా చూడాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించాలన్నారు. ఉదయం ముందుగా చెత్తకుప్పలు తొలగించాలని ఆదేశించారు. రోడ్లపైన, కాలువల్లో చెత్త వేసేవారిని గుర్తించి జరిమానాలు విధించాలన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ రవి, ఏసిపి మధు, డి.ఈ. లు మధు, శిల్ప, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.

ఇస్కాన్ ఆలయం ముందు మురుగు ప్రవాహం



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి హరే రామ హరే కృష్ణ ఆలయం (ఇస్కాన్) ముందు రోడ్డుపై మురుగు నీరు పారుతోంది. ఆలయం ముందున్న మురుగు కాలువ మరమ్మతులకు గురైంది. మరో రెండు రోజుల్లో గోకులాష్టమి ఏర్పాట్లను ఆలయ నిర్వహుకులు చేపడుతున్నారు. ఈ ఏర్పాట్లలో భాగంగా క్యూలైన్లను రోడ్డుపై ఏర్పాటు చేశారు. దీంతో ఒకవైపు డ్రైనీజీ నీరు, మరోవైపు క్యూ లైన్‌తో రోడ్డు పరిధి కుంచించుకు పోయింది. రోజుకు దాదాపు 10 వేల మంది భక్తులు ఆలయానికి వస్తుంటారు. ఈ పరిసరాల్లో టిటిడి ఫారెస్ట్ కార్యాలయం, రామకృష్ణ మిషన్, బిఎస్ఎన్ఎల్ గెస్ట్ హౌస్, ఏపీఎస్ఆర్టీసీ అలిపిరి డిపో, భూదేవి కాంప్లెక్స్, బ్రహ్మకుమారిస్ కార్యాలయం, ఎన్జీవోస్, పలువురు ప్రముఖులు నివసిస్తున్నారు. తిరుపతి ఎమ్మెల్యే సైతం అక్కడికి కేవలం 200 మీటర్ల దూరంలో నివాసం ఉంటున్నారు. అయిన్నప్పటికీ నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో డ్రైనీజీ సమస్య పరిష్కారం నత్తనడకన సాగుతోంది. ఈ మార్గంలో అటు టీటీడీ అధికారులు, ఇటు కార్పొరేషన్ ఉన్నత అధికారులు తిరుగుతున్నా కనీసం స్పందించకపోవడం బాధాకరం. సంబంధిత అధికారులు స్పందించి, కాలవ మరమ్మత్తులు పూర్తి చేయాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.

వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశంలో కలెక్టర్

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: ప్రముఖ పుణ్యక్షేత్ర, పర్యాటక కేంద్రమైన తలకోన సిబిఈటి ప్రాంగణంలో బుధవారం జిల్లాస్థాయి వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అటవీ శాఖలో ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎఫ్ఆర్ఓ, ఎఫ్‌బిఓల పరిధిలోని అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకొని సమస్యలను పరిష్కరించారు. యర్రావారిపాలెం మండలంలో ఏనుగు మృతికి గల కారణాలు, అటవీ సమీప ప్రాంతంలో పొలాలు వద్ద అడవి జంతువుల నుంచి పంట రక్షణకై రైతులు తీస్తున్న కరెంటు వాటి వలన జరిగే, ప్రమాదాలు గురించి అడిగి తెలుసుకున్నారు. నర్సరీ ప్లాంటేషన్ పెంపకం కోసం స్థలం కేటాయించాలని ఫారెస్ట్ అధికారులు కలెక్టర్ కోరారు. అధికారులందరూ పనితీరును మరింత పెరుగుపరుచుకోవాలని ఆదేశించారు. అనంతరం జలపాతం దగ్గరికి వెళ్లి ప్రమాద పరిస్థితులను, రోడ్డు మార్గాలను పరిశీలించి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకొని నిర్మాణాలు చేపట్టాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. డిస్టిక్ లెవెల్ ఫారెస్ట్ అండ్ వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ కమిటీ మీటింగ్ లో జిల్లాలో ఏనుగుల వలన నష్టపోయిన రైతులకు పెండింగ్లో ఉన్న నష్టపరిహారం వీలైనంత త్వరగా చెల్లించాలని, ఏర్పేడు మండలంలోని వెంకటగిరి మార్గంలో గల చింతలపాలెం చెక్ పోస్ట్ అక్కడే ఉంచేలా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర చర్యలు తీసుకోవాలని సమావేశంలో డిఎఫ్ఓ వివేక్ ఆనంద్ కోరారు. శేషాచలం అడవుల నుండి ఎర్రచందనం అక్రమ రవాణా చట్ట వ్యతిరేక కార్యక్రమాలను ఈ చెక్పోస్టు ద్వారా అడ్డుకోవడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జెసి, శుభం బన్సల్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డిఎఫ్ఓ, పి.వివేక్ ఆనంద్, డిప్యూటీ సీఎఫ్, జి.శ్రీనివాసులు, సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ నాగభూషణం, జిల్లా అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.



తలకోన జలపాతం వద్ద కలెక్టర్


305 మందికి షో కాజు నోటీసులు

ఇంటింటా తిరంగా ర్యాలీకి హాజరు కాలేదని నోటీసులు జారీ చేసిన కమిషనర్

ఉదయం 6 గంటలకు 6.30 కల్లా రావాలని సమాచారమిస్తే ఎలా వెళ్లగలం..?

వేధింపులకు గురి చేస్తున్నారని సచివాలయ ఉద్యోగుల ఆవేదన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి నగరంలో మంగళవారం ఉదయం 6:30 గంటలకు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి సచివాలయ ఉద్యోగులు హాజరు కాలేదని సుమారు 305 మందికి కమిషనర్ మౌర్య షో కాజ్ నోటీస్ జారీ చేశారు. ఇందులో సచివాలయ విభాగానికి చెందిన వారు 281 మంది, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సూపరింటెండెంట్లు 24 మంది ఉన్నారు. మొత్తం 305 మందికి షోకాజ్ నోటీసు జారీ చేయడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఉదయం 6:30 గంటలకు తిరంగా ర్యాలీ పెట్టి సచివాలయ ఉద్యోగులకు ఉదయం 6 గంటలకు మెసేజ్ పెట్టడం వల్ల చాలామంది సచివాలయ ఉద్యోగులు ఈ ర్యాలీకి హాజరు కాలేదు. ర్యాలీ ముందు ఒక సారి, ర్యాలీ ముగిసిన తర్వాత మరోసారి అటెండెన్స్ తీసుకున్నారు. రాని వారిని గుర్తించి నోటీసులు ఇచ్చారు. ఇందులో సచివాలయ అడ్మిన్ విభాగం, పారిశుద్ధ విభాగం, వెల్ఫేర్ విభాగం, ప్లానింగ్ విభాగం, ఆరోగ్య విభాగం, విఆర్ఓ విభాగం, మహిళా పోలీసు విభాగాలకు చెందిన వారు ఉన్నారు. ఉదయం 6 గంటలకు మెసేజ్ పెట్టి 6.30 కల్లా ఇంటింటా తిరంగా ర్యాలీకి రమ్మంటే ఎలా వస్తారని సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ర్యాలీ రెండు రోజుల ముందే నిర్వహిస్తున్నారని ఉన్నతాధికారులకు సమాచారం ఉన్నప్పటికీ సచివాలయ ఉద్యోగులకు మాత్రం ఉదయం 6 గంటలు సమాచారం ఇవ్వడం వల్ల చాలామంది రాలేకపోయారని, రాని వారికి నోటీసులు ఇవ్వాల్సిన అవసరం ఏముందని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే సచివాలయ ఉద్యోగులు పి4 సర్వే, వర్క్ ఫ్రం హోం సర్వే, ఇతర సర్వేలు నిర్వహిస్తున్నప్పటికీ వారి పట్ల మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వ్యవహరిస్తున్న తీరు పట్ల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ఎంత కష్టపడి పని చేస్తున్నప్పటికీ సెలవులు లేకపోయినా కూడా సమీక్ష సమావేశాలు, టెలికాన్ఫరెన్స్‌లు ఎప్పుడంటే అప్పుడు నిర్వహించి తమను ఇబ్బంది కలిగిస్తున్నప్పటికీ, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నా అధికారులు మాత్రం తమ పట్ల చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల విధులు నిర్వహించినప్పటికీ వాటి సంబంధించిన డబ్బులు కూడా సచివాల సిబ్బందికి ఇవ్వకపోవడం దారుణం. ఇప్పటికైనా కమిషనర్ స్పందించి సచివాలయ ఉద్యోగులకు ఇచ్చిన నోటీసులు రద్దు చేయాలని కోరుతున్నారు.



అధ్యాపకుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రంలో డిగ్రీ, పీజీ కళాశాల, యూనివర్సిటీలలో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని ఏబిఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షులు ఆచార్య వైవి రామిరెడ్డి డిమాండ్ చేశారు. తిరుపతిలోని స్థానిక హోటల్ లో నిర్వహించిన మేధావుల సదస్సుకు విచ్చేసిన బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షులు పివిఎన్ మాధవ్‌ని ఏబిఆర్ఎస్ఎం ఆంధ్రప్రదేశ్ శాఖ తరపున కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ డిగ్రీ, జూనియర్, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలో, ఇతర ఉన్నత విద్యా సంస్థలలో పనిచేస్తున్న అధ్యాపకుల, విద్యాసంస్థల సమస్యలను పరిష్కరించాలని కోరారు. డిగ్రీ ప్రవేశాలకు, పిజిసెట్ నోటిఫికేషన్‌లు విడుదల చేయాలని కోరారు. పిహెచ్‌డి ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష నిర్వహించాలన్నారు. పిఆర్‌సి కమిటీని నియమించాలని, కేంద్రం విడుదల చేసిన డిఎలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. ఈహెచ్ఎస్ హెల్త్ కార్డుల సమస్యను తెలియచేశారు. స్పందించిన మాధవ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ, తిరుపతి జిల్లా అధ్యక్షులు నాగరాజు, ప్రతినిధులు రవిశంకర్, పద్మావతమ్మ, ప్రియవర్ధనబాబు, మంజునాథ్, సంధ్య, వివేక్, వెంకటసుబ్బయ్య, మొదలైన వారు పాల్గొన్నారు.

ఆటోలు, ప్రైవేటు బస్సులపై ఆర్టీవో కొరడా

60 ఆటోలకు రెండు లక్షల రూపాయలు, రెండు బస్సులకు మూడు లక్షల రూపాయలు జరిమానా



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతికి వచ్చే భక్తుల పట్ల సేవా భావంతో మెలుగుతూ తిరుపతి పుణ్యక్షేత్ర విశిష్టాన్ని ఇనుమడింపజేసేలా ఆటోలు వివిధ వాహనదారులు నడుచుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ సూచించారు. గురువారం తిరుపతి నగరంతో పాటు, మంగళం ప్రధాన మార్గంలో పోలీసు, రవాణా శాఖ అధికారులు సంయుక్త వాహన తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించని 60 ఆటో రిక్షాలకు రెండు లక్షల రూపాయలు, రెండు బస్సులకు మూడు లక్షల రూపాయల జరిమానాలను విధించినట్లు ఆర్టీవో తెలిపారు. దూర ప్రాంతాల నుండి ఎంతో భక్తి భావంతో వచ్చే వారికి తిరుపతి నగరంలో ఉండే ఆటో రిక్షాల చోదకులు వారి ప్రవర్తన, మాటతీరు, డ్రైవింగ్ నైపుణ్యం భక్తి భావాన్ని పెంచేలా ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమించి తప్పుడు ప్రవర్తనకు తగిన మూల్యం చెల్లించుకోవలసి ఉంటుందని చట్టపరమైన చర్యలతో డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ వాహన తనిఖీల్లో ఎంవిఐలు సుబ్రమణ్యం, శ్రీనివాసరావు, అతికానాజ్, నిఘా విభాగపు తనిఖీ అధికారులు మోహన్ కుమార్, రమణ నాయక్, ఆంజనేయ ప్రసాద్ ట్రాఫిక్ సిఐ భాస్కర్ నాయక్, సుబ్బిరామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సంయుక్త వాహన తనిఖీలను ట్రాఫిక్ డిఎస్పి రామకృష్ణ చారి పర్యవేక్షించారన్నారు. జరిమానాలతో పాటుగా కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందన్నారు.


స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్‌గా వెంకట్రావు

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్‌గా ఎడ్యుకేషన్ విభాగం ఆచార్యులు ప్రొ.పి.వెంకట్రావును నియమించడం జరిగినది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొ. జి.యస్.ఆర్ కృష్ణమూర్తి వెంకట్రావుకు డీన్ ఆఫీస్ ఆర్డర్ విసి చాంబర్‌లో అందించారు. విశ్వవిద్యాలయంలోని ఎడ్యుకేషన్ విభాగం అధ్యాపకులు, విభిన్న విభాగాల అధ్యాపకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

తెరమీదకు బాలాజీ డివిజన్

- మేధావులతో ఉద్యమాన్ని ప్రారంభించే యోచన : కుప్పల గిరిధర్ కుమార్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతిని బాలాజీ డివిజన్ ఏర్పాటు చేయాలని మళ్లీ ఉద్యమం పురుడు పోసుకుంటోంది. త్వరలో మేధావులతో కలిసి ఈ ఉద్యమాన్ని ప్రారంభించేందుకు కొందరు రైల్వేలో పదవి విరమణ చేసిన ఉద్యోగులతో పాటు, స్థానిక ప్రజలు, వివిధ రంగాల్లో ఉన్నవారు ఉద్యమంలో పాల్గొననున్నారు. ఇప్పటికే బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి పేరుతో ఓ సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. ఈ సంఘానికి కుప్పల గిరిధర్ కుమార్ కన్వీనర్‌గా ఉన్నారు. ఆయన రైల్వే సంఘ యూనియన్ తిరుపతి అధ్యక్షులుగా పనిచేశారు. ప్రస్తుతం ఈయన ఉద్యోగ విరమణ చేయడంతో బాలాజీ డివిజన్ ఏర్పాటుకు ఉద్యమాన్ని ప్రారంభించబోతున్నారు. తిరుపతి బాలాజీ డివిజన్ ఏర్పాటు చేయాలనేది గత 30 సంవత్సరాల నుంచి ఉన్న డిమాండ్. అయితే రైల్వే బోర్డు తిరుపతి బాలాజీ డివిజన్ ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపకపోవడంతో రైల్వే పరంగా అభివృద్ధి పనులు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తిరుపతి రైల్వే స్టేషన్‌కు రోజుకు 80 రైళ్లు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. తిరుపతి తూర్పు రైల్వే స్టేషన్ కేవలం 6 ప్లాట్‌ఫామ్‌లే ఉన్నాయి. ఇది ఏమాత్రం సరిపోవు. తిరుమలకు వచ్చే యాత్రికులు సుమారు లక్ష మంది రాకపోకలు సాగిస్తూ ఉంటారు. రైళ్లల్లో తిరుపతికి వచ్చే వారే సంఖ్య అధికం. తిరుపతి రైల్వే స్టేషన్‌కు రిజర్వేషన్ల ద్వారా ఏడాదికి 250 కోట్ల రూపాయలు ఆదాయం వస్తుంది. తిరుపతి నగరంలో సుమారు నాలుగు లక్షల మంది జనాభా ఉన్నారు. అందులో 50 వేలమంది రైల్వేలో పని చేసేవారు వివిధ రంగాల్లో ఉన్నారు. ప్రత్యేక రైళు నడపాలంటే తిరుపతి రైల్వే స్టేషన్‌కు అంత సామర్థ్యం లేకపోవడంతో తిరుచానూరు పడమర రైల్వే స్టేషన్‌లో రైళ్లను నిలుపుతారు. తిరుపతితోపాటు రేణిగుంట రైల్వే క్యారేజ్ రిపేర్ షాపులో సుమారు 6 వేలమంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇటు పాకాల లో కూడా రైల్వే కార్మికులు ఉన్నారు. తిరుపతి రైల్వే స్టేషన్ ఇటు తమిళనాడు అటు కర్ణాటక సరిహద్దుల మధ్య ఉండడంతో ప్రయాణికులు రాకపోకలు ఎక్కువగానే ఉంటాయి. దీని తోడు తిరుపతి ఎయిర్‌పోర్ట్ కూడా దగ్గరలో ఉండడంతో తిరుపతి ప్రాధాన్యత సంతరించు కుంది. కేంద్ర ప్రభుత్వ నిధులతో సుమారు 400 కోట్లతో తిరుపతి రైల్వే స్టేషన్ అభివృద్ధి జరుగుతోంది. అలాగే రేణిగుంట రైల్వే స్టేషన్ తూర్పు వైపు ముఖద్వారం ఏర్పాటు చేయడానికి 200 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు పంపడం జరిగింది. తిరుచానూరు రైల్వే స్టేషన్ కూడా అందుబాటులో ఉండడం, తిరుపతి జిల్లా ఏర్పడడంతో మండలంలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన ప్రదేశంగా మారింది. తిరుపతికి సమీపంలో శ్రీ సిటీ ఉండడంతో జాతీయ, అంర్జాతీయ పరిశ్రమల ఏర్పాటుకు మరో అదనపు ప్రాధాన్యత సంతరించుకుంది.



1991 లోనే బాలాజీ డివిజన్ ఊపిరి..

1991లో కాంగ్రెస్ పార్టీ తిరుపతి అవిలాలో ప్లీనరీ సమావేశం నిర్వహించింది. ఆ సమావేశానికి కేంద్ర రైల్వే శాఖ మంత్రి సీకే జాఫర్ షరీఫ్ తిరుపతి బాలాజీ డివిజన్ చేయడానికి అనువుగా ఉందని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ నేతలు తిరుపతిని బాలాజీ డివిజన్ చేయాలని అప్పట్లో ప్లీనరీలో తీర్మానాన్ని ప్రవేశపె ట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారం లో వచ్చిన వెంటనే బాలాజీ డివిజన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. 1994లో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడడంతో బాలాజీ డివిజన్ ప్రక్రియ ముందుకు సాగలేదు. అయితే తిరుపతి బాలాజీ డివిజన్ ఏర్పాటు చేయాలని స్థానికులు ఉద్యమించడం జరిగింది. ప్రభుత్వం పరశీలనకు ఒక కమిటీ కూడా వేయ దం జరిగింది. తిరుపతి బాలాజీ డివిజన్ ఇప్పట్లో ఏర్పాటు చేయలేమని అప్పటి ఎన్డీఏ ప్రభుత్వం ప్రకటిం చింది. రైల్వే బోర్డు కూడా తిరుపతిని బాలాజీ డివిజన్ చేయలమని ప్రకటించింది. 2003లో మళ్లీ బాలాజీ డివిజన్ తెర పైకి తీసుకువచ్చినా అది సాధ్యం కాదని ప్రక టించేశారు. దేశంలో ప్రస్తుతం 16 రైల్వే డివిజన్లో ఉన్నాయి.

బాలాజీ డివిజన్ వల్ల ఉపయోగాలు..

తిరుపతి బాలాజీ డివిజన్ ఏర్పాటు చేయడం వల్ల సుమారు 15 వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా రైల్వేలో ఉద్యోగాలు లభిస్తాయి. రైల్వే బడ్జెట్లో నిధులు కొత్త ప్రాజెక్టులు, కొత్త రైలు మార్గాలు అనుమతులు వస్తాయి. ప్రస్తుతం ఉమ్మడి చిత్తూరు జిల్లా రైల్వే పరంగా చాలా వెనకబడి ఉంది. తిరుపతి నుండి చెన్నై, బెంగళూరు, విజయవాడ, హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. డిమాండ్ కనుగుణంగా అదనపు రైళ్లను వేసే అవకాశం కలుగుతుంది. దీనికి తోడు ఇక్కడ పలు కొత్త పరిశ్రమలతో పాటు ఈ జిల్లాలో పండించే కూరగాయలు, పండ్లు ఇతర రాష్ట్రాలకు రైతులు రవాణా చేసుకునే సౌలభ్యం కలుగుతుంది. ఐటిఐ, బీటెక్ చేసిన విద్యార్థులకు రైల్వే డివిజన్ వల్ల అప్రెంటిస్ ఉద్యోగాలు లభిస్తాయి. రేణిగుంటలో రైల్వే క్యారేజ్ రిపేర్ షాపు ఉన్నప్పటికీ అప్రెంటిస్ ఉద్యోగాలు ఎక్కువగా ఒరిస్సా బీహార్, బెంగాల్, వాసులకు లభిస్తున్నాయి. డివిజన్ వల్ల సుమారు 1000 ఎకరాల్లో ఉద్యోగులకు క్వార్టర్స్, పాఠశాలలు, కళాశాలలు, రైల్వే ఆసుపత్రులు, రైల్వే సూపర్ బజార్లు ఏర్పాటు అవుతాయి. డివిజన్ వల్ల ముఖ్యమైన జంక్షన్లో రైళ్లు స్టాపింగ్‌ల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుంది. డివిజన్ ఏర్పడితే తిరుపతి జిల్లాతో పాటు చిత్తూరు జిల్లా వాసులు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. డివిజన్ వల్ల రైల్వే పోటీ పరీక్షలు కూడా తిరుపతిలో సెంటర్ పెట్టుకునే అవకాశం దీనికి తోడు రైల్వే ఉద్యోగులు అనారోగ్యం గురైతే ఆపరేషన్ల కోసం గుంతకల్లు డివిజన్ వెళ్లాల్సిన అవసరం ఉండదు. ప్రస్తుతం తిరుపతి రైల్వే స్టేషన్ స్పెషల్ గ్రేడ్ స్టేషన్‌గా ఉంది.

బాలాజీ డివిజన్ ఏర్పాటుకు ఇదే అదును : కుప్పాల గిరిధర్ కుమార్, రైల్వే సంఘ యూనియన్ మాజీ నాయకులు

తిరుపతి బాలాజీ డివిజన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఉండటం వల్ల బాలాజీ డివిజన్ ఏర్పాటు చేసుకుంటే ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులతో పాటు ఇటు కడప అటు నెల్లూరు జిల్లా వాసులకు కూడా ఎంతో ఉపయోగపడుతుంది. విశాఖ ఉక్కు తరహా ఉద్యమం చేపడితే బాలాజీ డివిజన్ ఏర్పాటు తద్యం. తిరుచానూరు రైల్వే స్టేషన్ ఏర్పాటుకు ఆయన ఎంతో కృషి చేశాం. తిరుపతి తూర్పు రైల్వే స్టేషన్ అభివృద్ధికి కూడా, పనులు అనుమతులు తీసుకురావడం లో కీలకపాత్ర వహించాం. 2015-19లో టిటిడి బోర్డు చైర్మన్‌గా చదలవాడ కృష్ణమూర్తి పీఏగా పనిచేసిన సమయంలో తిరుపతి రైల్వే అభివృద్ధికి పలు సమస్యలు కేంద్రం దృష్టి తీసుకెళ్లి మంజూరు చేసేలా చర్యలు చేపట్టడం జరిగింది.

వెంకన్నకు విరాళాల వెల్లువ







ప్రజాశక్తి - తిరుమల: బెంగుళూరుకు చెందిన కె.యం.శ్రీనివాసమూర్తి అనే భక్తుడు బుధవారం ఉదయం భోగ శ్రీనివాసమూర్తికి అలంకరించేందుకు రూ.25 లక్షలు విలువైన వజ్రం, వైజయంతి పొదిగిన 148 గ్రాముల బంగారు లక్ష్మీ పతకాన్ని విరాళంగా అందించారు. ఈ మేరకు శ్రీవారి ఆలయంలోని రంగనాయకులు మండపంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి ఆభరణాన్ని అందజేశారు.

టీటీడీకి రూ.కోటి విరాళం

అలాగే బెంగుళూరుకు చెందిన కల్యాణ్ రామన్ కృష్ణమూర్తి అనే భక్తుడు బుధవారం టీటీడీ శ్రీవేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు కోటి రూపాయలు విరాళంగా అందించారు. ఈ మేరకు తిరుమలలోని తిరుమల తిరుపతి దేవస్థానం అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీ రూపంలో అందజేశారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, భారతీయ జనతా పార్టీ నేత విష్ణు వర్ధన్ రెడ్డి, నిజామాబాద్ శాసనసభ్యుడు సూర్యనారాయణ వున్నారు. వీరికి ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం దర్శన ఏర్పాట్లను చేయగా రంగనాయక మండపంలో అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు.

ఎర్రమట్టి దిబ్బల్లో ఏనుగుల జలకాలాటలు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి తిరుమల రేంజి అటవీ ప్రాంతం ఎర్రమట్టి దిబ్బలు వద్ద ఉన్న కొలనులో ఏనుగుల గుంపు జలకాలాడటం అటవీ శాఖ ఏర్పాటు చేసిన కెమెరాలో రికార్డయింది. ప్రపంచ ఏనుగుల దినోత్సవం సందర్భంగా ఏనుగు జలకాలాడిన ఫోటోలు మీడియాకు విడుదలయ్యాయి. ఈ ఏనుగుల గుంపులు ఎక్కువ భాగం ఏనుగుల పిల్లలు ఉండడం గమనార్హం.

స్వామిత్వ సర్వే జరపండి

ప్రజాశక్తి - వాకాడు: మండల పరిషత్ కార్యాలయంలో గూడూరు డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ వాణి రెడ్డి అధ్యక్షతన స్వామిత్వ పై బుధవారం స్వామిత్వపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని కొండూరు, ముంగలదొరువు, రెడ్డిపాలెం బిట్1, రెడ్డిపాలెం బిట్ 2, ఇస్కపల్లి రెవెన్యూ గ్రామాలలో స్వామిత్వ డ్రోన్ ఇళ్ల స్థలాలు సర్వే చేసి ప్రాపర్టీ కార్డులు ఎలా మంజూరు చేయాలో ఈ ట్రైనింగ్ ప్రోగ్రాంలో పంచాయతీ కార్య దర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. ట్రైనింగ్ సెషన్ పూర్తయిన తర్వాత సర్వే పంచాయతీపై, శానిటేషన్పై, ఇతర సర్వేలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డిడిఓ ఉప కార్యదర్శి మనోజ్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో ఉమామహేశ్వర రావు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు గడువు పొడిగింపు

ప్రజాశక్తి - క్యాంపస్: జవహర్ నవోదయ విద్యాలయలో 2026-27 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశ పరీక్షకు సంబంధించి, దరఖాస్తులు సమర్పించడానికి చివరి తేదీ ఆగస్టు 27 వరకు పొడిగించారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ప్రవేశ పరీక్ష విధానం, దరఖాస్తు సమాచారం విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రంలో పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 8688888802 / 9399976999 ఫోన్ నంబర్లను, వరదరాజ నగర్ లోని విశ్వం సైనిక్, నవోదయ పోటీ పరీక్షల సమాచార కేంద్రాన్ని సంప్రదించాలన్నారు.

ఏపీఎం రజినిపై దాడి హేయం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అన్నమయ్య జిల్లా, గుర్రంకొండ మండలానికి చెందిన మహిళా ఏపీఎం రజని కుమారిపై జరిగిన దాడిని ఖండిస్తూ నారాయణవనం మండలం, వెలుగు (సెర్ప్) ఉద్యోగులు కార్యాలయ ఆవరణలో బుధవారం నిరసన ప్లకార్డ్ ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సెర్ప్ ఉద్యోగుల రాష్ట్ర యూనియన్ అధ్యక్షులు బి.ధనంజయ రెడ్డి మాట్లాడుతూ దాడులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ ఇలాంటి సంఘటనలు పునరావృతమవకుండా చూడాలని ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సెర్ప్ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జిల్లా గౌరవ అధ్యక్షులు ఎ.నాగేంద్ర రావు, నారాయణవనం మండలం ఏపిఎం సుకన్య, జిల్లా నాయకులు బి.సుదర్శన్ రావు, అరుణ్ కుమార్, రాజేశ్వరి, నిమ్మ విజిమేల బుజమ్మ సెల్ఫీ ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి డీవైఈఓగా ఇందిరాదేవి



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: రేణిగుంట మండల విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్న ఇందిరాదేవి బుధవారం డీఈఓ తిరుపతి కార్యాలయంలో తిరుపతి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. తదనంతరం జిల్లా విద్యాశాఖాధికారి కుమారను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఇందిరాదేవిని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పలువురు ఎంఈవోలు అధికారులు, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

సముద్రపు నాచు మొక్కల పెంపకంపై శిక్షణ

ప్రజాశక్తి - వాకాడు: సముద్రంలో నాచు మొక్కలు పెంపకంపై బుధవారం వాకాడు మండల పరిధిలోని కొండూరు పాలెం మత్స్యకారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడి రాజేష్ మత్స్యకారులకు పలు సలహాలు ఇచ్చారు. మత్స్యకారులు తమ జీవనోపాధిలో భాగంగా ఈ నాచు మొక్కలు పెంపకం వలన ఉపాధి పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్డిఓ రెడ్డి నాయక్, దుగరాజపట్నం మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, టిడిపి నాయకులు దయాకర్, హరీష్ నాయుడు, మత్స్యకార సంఘం నాయకుడు మహేంద్ర, మత్స్యకార కాపులు, మత్స్య శాఖ సహాయకులు పుష్పరాజ్, వెంకటరమణ, రమేష్, శ్రీను పాల్గొన్నారు.

నేలమడుగు చెక్క ఏర్పాటు

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు మండల పరిధి, చెన్నూరు, తిప్పవరప్పాడు గ్రామాలకు చెందిన చెరువులో నేల మడుగు వద్ద చెక్క దెబ్బతినిపోయింది. దీంతో చెన్నూరు నీటి సంఘం అధ్యక్షులు యారమావు హేమ కుమార్ రెడ్డి నూతన చెక్కను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయం ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. ఈ చెరువు కింద ఆయకట్టు పారుదల దాదాపుగా 1040 ఎకరాలు సాగుఅవుతోంది, ఈ చెక్కు దెబ్బతినడంతో చెరువులో నీరు వృథాగా పోయేదన్నారు. అక్కడ ఇసుక మూటలు అడ్డుగా వేసినా ఫలితం లేకుండా పోయిందని, ఈ విషయాన్ని గూడూరు శాసన సభ్యులు పాశం సునీల్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత ఇరిగేషన్ అధికారులకు చెప్పి వెంటనే కొత్త చెక్కును ఏర్పాటు చేయించారని తెలిపారు. చెరువు కట్ట కూడా దెబ్బతిని ఉందని, వర్షాకాలం రాకముందే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు. ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలిపారు.

మాదకద్రవ్యాలతో ఆరోగ్య క్షయం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: గంజాయి, హెరాయిన్, బ్రౌన్ షుగర్, తంబాకు మొదలైన మాదకద్రవ్యాల వాడకంతో శరీరం నాశనమవుతుందని పుత్తూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రమౌళి హెచ్చరించారు. బుధవారం పుత్తూరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాలపై రాస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డాక్టర్ బి.చంద్రమౌళి మాట్లాడుతూ మాదకద్రవ్యాల విషయంలో తల్లిదండ్రులు, పెద్దలు యువత పై దృష్టి పెట్టి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాస్ ప్రతినిధులు కౌన్సిలర్ నాగరాజు, ఎం.దాములు మాట్లాడుతూ రాస్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల డీఅడిక్షన్ సెంటర్ పాపానాయుడు పేటలో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కోటేశ్వర్రావు, డాక్టర్ సుజన, డాక్టర్ ఆర్.బి వాణిశ్రీ, డాక్టర్ వి.వాసవి, డాక్టర్ గాయత్రి, పద్మావతి, డాక్టర్ గంగయ్య, సావిత్రి తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

హెచ్ఐవిపై అవగాహన

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: మండలంలోని నెరబైలు జూనియర్ కళాశాలలో హెచ్ఐవిపై కోర్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ హర్షిత మాట్లాడుతూ విద్యార్థులు హెచ్ఐవి పట్ల విద్యార్థి దశ నుండి అవగాహన కలిగి ఉండి హెచ్ఐవి వ్యాప్తి దాని నివారణ మార్గాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సునంద, నెరబైలు పిహెచ్సి డిడిఓ సుమంత్, కోర్ సంస్థ ప్రతినిధులు తులసి, విజయలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మయూరి శ్యామ్కి జాతీయ పురస్కారం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నార్త్ ఢిల్లీ కల్చరల్ అకాడమీ (ఎన్.డి.సి.ఏ) వారు గూడూరుకు చెందిన ప్రముఖ సామాజిక వేత్త శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ బండి శ్యామసుందరరావు (మయూరి శ్యామ్ యాదవ్)కు జాతీయ అవార్డు-2025 ఇవ్వడం జరిగింది. మయూరి శ్యామ్ యాదవ్ అనేక సామాజిక సేవ కార్యక్రమంలో చేయడంతో అది గుర్తించిన ఎన్.డి.సి.ఏ ఈ అవార్డు ఇవ్వడం జరిగింది. ఈసందర్భంగా మయూరి శ్యామ్ యాదవ్ జాతీయ స్థాయిలో అవార్డు దక్కినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఈ అవార్డు ఇచ్చిన ఎన్.డి.సి.ఏ నేషనల్ డైరెక్టర్ డాక్టర్ బింగి నరేంద్ర గౌడ్కి మయూరి శ్యామ్ యాదవ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మైనింగ్ క్వారీలు రద్దు చేయాలి : సిపిఎం



ప్రజాశక్తి - సత్యవేడు : గిరిజనుల అటవీ బాటను ఆక్రమించిన మైనింగ్ క్వారీలను రద్దు చేయాలని బుధవారం చమర్తి కండ్రిగ గిరిజన కాలనీ సమీపంలోని క్వారీలు నిర్వహిస్తున్న రోడ్డుపై సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్దన్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరినాథ్ రెడ్డి డిమాండ్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవించే చమర్తి కండ్రిగ గిరిజనుల అటవీ దారి బాటను మైనింగ్ క్వారీలు ఆక్రమించి వారి జీవనోపాధికి భంగం కల్పించడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ అధికారులు చోద్యం చూడటం అన్యాయమన్నారు. మైనింగ్తో గిరిజనుల ఇళ్లు బీటలు వారుతున్నాయని ఆరోపించారు. పేలుళ్లలో వాడే మందు పదార్థాలతో వాయు కాలుష్యం, నీటి కాలుష్యం ఏర్పడి గిరిజనులు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. పరిమితికి మించి, ఎక్కువ లోతులలో మైనింగ్ చేపట్టడంతో నీటి మట్టం తగ్గి గిరిజనులు తాగునీరు లేక అలమటిస్తున్నారన్నారు. సత్యవేడు ప్రాంతీయ కార్యదర్శి మెలుగు రమేష్ మాట్లాడుతూ అటవీ హక్కు-2005 చట్ట ప్రకారం చమర్తి కండ్రిగ గిరిజనులకు అటవీ దారి బాటను కల్పించాలన్నారు. అక్రమ క్వారీలను రద్దుచేసి, నీటి వసతి కల్పించి, హెల్త్ క్యాంపు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సత్యవేడు తహశీల్దార్ రాజశేఖర్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్స్పెక్టర్ సురేష్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. విచారణ ముగిసే వరకు క్వారీ మైనింగ్ ఆపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చమర్తి కండ్రిగ గిరిజనులు వెంకటేశులు, కన్నయ్య, చెంచు రామయ్య, శీను, సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, సిపిఐ నాయకులు చినరాజు, నాగార్జున, సిపిఎం కార్యకర్తలు మురళి, మునస్వామి, కిష్టయ్య, ఏసన్న, ఢిల్లీ, వెంకటేశులు పాల్గొన్నారు.

అత్యాధునిక 800 పడకల ఆసుపత్రికి శ్రీకారం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఎస్ఎల్జీ హాస్పిటల్స్, అజెంక్య డీవై పాటిల్ హెల్త్కేర్ సంస్థలు ఒక వ్యూహాత్మక నిర్వహణ ఒప్పందంపై సంతకాలు చేశాయి. దీని ద్వారా హైదరాబాద్, నిజాంపేటలో 800 పడకల అత్యాధునిక మల్టీ-స్పెషాలిటీ ఆసుపత్రిని కలిసి నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అజెంక్య డీవై పాటిల్ హెల్త్కేర్ చైర్మన్ డాక్టర్ అజెంక్య పాటిల్ మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తక్కువ ఖర్చుతో మంచి వైద్యం అందించడమే ఈ రెండు సంస్థల లక్ష్యమని తెలిపారు. ఈ కొత్త ఆసుపత్రిలో అత్యవసర చికిత్స, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి వాటికి ఆధునిక వైద్యం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ ప్రాంత ప్రజలకు వైద్యం కోసం వేరే చోటుకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని తెలిపారు. ఆసుపత్రి నిర్మాణాన్ని దశలవారీగా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఒక్కో దశ పూర్తయిన తర్వాత కొత్త సేవలను ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా ఎస్ఎల్జీ హాస్పిటల్స్ చైర్మన్ దండు శివ రామ రాజు మాట్లాడుతూ. మంచి వైద్యం అందించాలనే తన కల నెరవేరుతుందని అన్నారు.

ఎస్వీయూలో డ్రోన్స్ ఎకోసిస్టమ్ అభివృద్ధి

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయులో ఆర్పిటిఓ మంజూరు కోసం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ పక్షాన 12,13 తేదీల్లో విశ్వవిద్యాలయం ప్రాంగణంలో రిమోట్ పైలట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ కోసం డ్రోన్ సిమ్యులేటర్ సాఫ్ట్వేర్, ఇతర వాటితో ప్రాక్టీస్, క్లాస్ రూమ్ సౌకర్యాల కోసం గ్రౌండ్ను సమగ్రంగా తనిఖీ చేసింది. ఈ తనిఖీని డిప్యూటీ డైరెక్టర్-ఆపరేషన్స్, కుంజ్ లత, చేతల్ సింగ్లు, అసిస్టెంట్ డైరెక్టర్-ఎయిర్వర్తినెస్, డ్రోన్ డైరెక్టరేట్, ప్రణవ్ చిట్టే, ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ అంజలి కలిసి చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ విసి ఆచార్య అప్పారావు మాట్లాడుతూ స్పేస్ టెక్నాలజీ, డ్రోన్స్, స్పేస్ టెక్, క్వాంటం కంప్యూటింగ్, వర్చువల్ ప్రొడక్షన్, సెమీ కండక్టర్స్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలకు టెక్నాలజీ లెర్నింగ్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, శిక్షణా సౌకర్యాలను ఎస్వీయూలో ఏర్పాటు చేయబోతున్నామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.భూపతి నాయుడు ఈ డ్రోన్ల పనితీరును పరిశీలించారు. మెకానికల్ ఇంజనీరింగ్ నుండి కోఆర్డినేటర్ ఆచార్య ధర్మారెడ్డి, విశ్వవిద్యాలయ ఇంజనీర్ తాండవ కృష్ణ , రుసా సిఈఓ వంశీకృష్ణ నిర్ధారించుకోవడానికి తనిఖీలో పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక ఎస్కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాను రూపొందించిన స్వర్గీయ పింగళి వెంకయ్యను స్మరించుకుంటూ జెండా గేయాన్ని ఆవిష్కరించారు. అర్థశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ బద్రి పీర్ కుమార్ ఇటీవల ఈ గేయాన్ని రాశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసులు, ఎన్.సి.సి. కోఆర్డినేటర్ మైమూన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయ మహేష్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ నారాయణ రాజు, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ పీర్ కుమార్, అధ్యాపకులు డాక్టర్ శైలజ తదితర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన

ప్రజాశక్తి - క్యాంపస్ : నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫామింగ్ కార్యక్రమంలో భాగంగా రాయలసీమ రీజియన్ జిల్లాల బీఆర్సి శిక్షణ కార్యక్రమం తిరుపతి జిల్లా రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో 11 నుంచి 14వ తేదీ వరకు నాలుగు రోజులు శిక్షణ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సాధికార సంస్థ తిరుపతి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. మూడవ రోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా తిరుపతి రూరల్ మండలం వేమూరు, అయ్యప్ప నాయుడు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను బీఆర్సి యాజమానులు సందర్శించారు. విత్తనాలు, నారు నాటి, పలురకాల కషాయాల తయారీని పరిశీలించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానాలు, కషాయాల గురించి, గ్రూప్ ప్రమోటర్స్ గ్రామపంచాయతీ స్థాయినించే వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఎం ఎంటి సత్యనారాయణ, జిల్లా రిసోర్స్ పర్సన్స్ నాగరాజు, నరేంద్ర, బి ఆర్ సి యజమానులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీలు, స్కూల్ డైరీ, వాటర్ ప్లాంట్ వితరణ

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొటాల జిల్లా పరిషత్ పాఠశాలకు బెంచీలు, స్కూల్ డైరీ, వాటర్ ప్లాంట్ వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల విద్యాశాఖ అధికారి, కొటాల జిల్లా పరిషత్ పాఠశాల సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం నాయకులు కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రికి దాతల సహాయం

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): చంద్రగిరి ఏరియా ఆసుపత్రికి అమెరికాలో ఉంటున్న దాతలు నరేంద్రనాథ్ రెడ్డి, హైమావతి దంపతులు ఒక స్ట్రెచర్, రెండు వీల్ చైర్లను విరాళంగా పంపించారు. ఈ సామగ్రిని వారి తరపున జనార్దన్ రెడ్డి, విశాలాక్షి దంపతుల చేతుల మీదుగా ఆసుపత్రికి అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ, ఇతర వైద్యులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో పాటు, దాతలు చూపిన ఔదార్యం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కవిత, డాక్టర్ కీర్తి, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ జీనత్, డాక్టర్ స్వర్ణ, డాక్టర్ సుష్మా, డాక్టర్ హేమంత్, హెడ్ సిస్టర్ కళావతి, స్టాఫ్ నర్సులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు చేరువయ్యేలా అన్నమయ్య కీర్తనలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: పద కవితా పితామహుడు, తాళ్లపాక అన్నమాచార్య కీర్తనలను యువతకు మరింతగా చేరువయ్యేలా చర్యలు తీసుకోవాలని టిటిడి ఈవో జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. టిటిడి పరిపాలనా భవనంలోని కార్యనిర్వాణాధికారి ఛాంబర్లో టిటిడి జేఈవో వి.వీరబ్రహ్మంతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, అన్నమయ్య కీర్తనలపై ప్రాంతీయ స్థాయిలో, జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించి యువతను భాగస్వామ్యం చేయాలని సూచించారు. తద్వారా అన్నమయ్య కీర్తనలను మరింతగా జనబాహుళ్యంలోకి తీసుకెళ్లవచ్చని తెలిపారు. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని కీర్తిస్తూ వాగ్గేయ కారుడు అన్నమయ్య 14,973 కీర్తనలను ఆలపించారని, ఇందులో 4,850 కీర్తనలను ఎస్వీ రికార్డింగ్ ప్రాజెక్ట్ రికార్డు చేసి 4,540 కీర్తనలను మాత్రమే అప్ లోడ్ చేశారని, మిగిలిన కీర్తనలను కూడా సకాలంలో రికార్డ్ చేసి భక్త ప్రపంచానికి అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్నమయ్య కీర్తనలను మరింతగా యువతకు అందించి, ప్రాచుర్యంలోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేకంగా యూట్యూబ్ ఛానల్కు తీసుకువచ్చే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. టిటిడి నిబంధనల మేరకు నవతరం గాయకులతో అన్నమయ్య కీర్తనలను రికార్డ్ చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. కాలానుగుణంగా సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా డిజిటల్ వ్యవస్థ ద్వారా అన్నమయ్య కీర్తనలను నవతరానికి అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతన్నల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం



ప్రజాశక్తి - నాయుడుపేట: రైతన్నల అభివృద్దే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ స్పష్టం చేశారు. బుధవారం నాయుడుపేటలో సూపర్ సిక్స్ -సూపర్ హిట్ కార్యక్రమంలో భాగంగా రైతు సంబర సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పిచ్చిరెడ్డి తోపు వద్ద గల విజయ గణపతి ఆలయం వద్ద నుండి ఏఎంసీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులను ఆదుకోవడంలో భాగంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలియజేశారు. నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 49 లక్షల మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ది పొందినట్లు తెలియజేశారు. నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, టీడీపీ నాయకులు కట్టా వెంకటరమణారెడ్డి, నెలవల రాజేష్, పేరంశెట్టి శ్రీరాంప్రసాద్, సన్నారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నానబాల సుబ్బారావు, అవధానం సుధీర్, కాపులూరు చక్రపాణి, పలుకూరు ముత్యాలయ్య, మొండెం బాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇకపై కేన్సర్ చికిత్స వేగవంతం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: సంజీవని-యునైటెడ్ ఎగైనెస్ట్ కేన్సర్' అనే తమ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా రెండు కేన్సర్ చికిత్స సంస్థలైన టాటా కేన్సర్ కేర్ ఫౌండేషన్ (టీసీసీఎఫ్), అస్సాం కేన్సర్ కేర్ ఫౌండేషన్ (ఏసీసీఎఫ్)లతో ఫెడరల్ బ్యాంక్ ఎంఓయూ కుదుర్చుకుంది. ఆయా ప్రాంతాల్లో బెనిఫిషియరీ సపోర్ట్ ఫండ్ (బీఎస్ఎఫ్)ను బలోపేతం చేసేందుకు ముందుకొచ్చింది. అస్సాం ప్రభుత్వంతో కలిసి టాటా ట్రస్టులు నెలకొల్పినదే ఏసీసీఎఫ్ కాగా, టీసీసీఎఫ్ అనేది టాటా ట్రస్టుల సొంత సంస్థ. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో కేన్సర్ చికిత్స కార్యక్రమాలను వేగవంతం చేయడానికి దీన్ని నెలకొల్పారు. ఫెడరల్ బ్యాంక్ హార్మిస్ మెమోరియల్ ఫౌండేషన్, టీసీసీఎఫ్ల మధ్య ఎంఓయూ మార్పిడి కార్యక్రమం ఆంధ్రప్రదేశ్లోని తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ కేన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్డ్ రీసెర్చ్ (ఎస్వీఐసీసీఏఆర్)లో జరిగింది.

టీటీడీ చైర్మన్కు ఆహ్వానం

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ తలకోన సిద్దేశ్వర స్వామి నూతన ఆలయ నిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి రావలసిందిగా టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడుకు బుధవారం తలకోన చైర్మన్ సోమనాథ్ రెడ్డి తన అనుచరులతో కలిసి ఆహ్వానం పలికారు. తలకోన ఆలయ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 18 కోట్ల నిధులతో ఆగస్టు 18 వ తేదీ సోమవారం చేస్తున్న భూమి పూజ కార్యక్రమానికి రావలసిందిగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీవో అధికారుల స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఆర్టీవో అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా తిరుపతి నగరంలో ఆటోలను తనిఖీలు చేశారు. రైల్వేస్టేషన్, పూర్ణ కుంభం, అన్నమయ్య సర్కిల్, గరుడ సర్కిల్ వద్ద సాయంత్రం నాలుగు గంటల నుండి ఆరు గంటల వరకు మంగళంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ప్రయాణికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిని గుర్తించి కౌన్సిలింగ్ ఇచ్చి హెచ్చరించారు. దీంతోపాటు డ్రైవింగ్ లైసెన్స్, ఆటో సీబుక్, డ్రైవర్ యూనిఫాంను తనిఖీ చేయడం చేశారు. 45 ఆటోలకు ఫైన్స్ వేయడం తోపాటు 24 ఆటోలను సీజ్ చేశారు. భక్తులపట్ల అమర్యాదగా వ్యవహరించే ఆటో డ్రైవర్లపై కేసు నమోదు చేసి, ఆటో సీజ్ చేస్తామని హెచ్చరించారు.

అల్యూమినియం కంపెనీలో ఈఎస్ఐ వైద్య శిబిరం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి కార్మిక రాజ్య బీమా(ఈఎస్ఐ)ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శ్యాంబాబు ఆధ్వర్యంలో బుధవారం తిరుపతి సమీపంలోని సిఎంఆర్ ఎకో అల్యూమినియం కంపెనీలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కంపెనీలో పనిచేసే సిబ్బంది, కార్మికులకు ఈఎస్ఐ ఆసుపత్రి డాక్టర్లు వైద్య సేవలు అందించారు. ఈ వైద్య శిబిరంలో ఆర్ఎంఓ డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, డాక్టర్స్ ఎం.ఉపేంద్ర కుమార్, జి.స్వర్ణ, వి.గాయత్రి, హెడ్ నర్స్ ఆర్.నాగ మద్దమ్మ, సిబ్బంది పి.హేమలత, పద్మజ, విజయన్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి అని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గూడూరు, 13 వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి , సంక్షేమం టీడీపీ తోనే సాధ్యమన్నారు.

మానసిక వికలాంగుడికి ఎలక్ట్రానిక్ చక్రాల బండి

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని శ్యామసుందర పురంలో నివాసం ఉన్నటువంటి పోలూరు అంకయ్య కుమారుడు తేజస్, మానసిక వికలాంగుడికి చెన్నై వాస్తవ్యులు నాగలాపురం గిరిధర్ రెడ్డి కుమార్తె హరిణి పుట్టినరోజు సందర్భంగా 49 వేల రూపాయలు విలువ చేసే ఎలక్ట్రానిక్ నాలుగు చక్రాల బండిని శ్రీ కోటమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ నల్లపురెడ్డి జగన్మోహన్ రెడ్డి, షిరిడి సాయి అక్షయ సేవా సమితి నిర్వాహకుల చేతులు మీదుగా బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో షిరిడి అక్షయ సేవా సమితి నిర్వాహకులు అల్లం. రమణయ్య, నాగలాపురం గిరిధర్ రెడ్డి, పెళ్లూరు కోటేశ్వర్ రెడ్డి, ఆవుల సుబ్బయ్య, పన్నగా సాయి, వెంపులూరు బాబురావు, సుబ్రహ్మణ్యం రెడ్డి, సుబ్బారావు, పవన్, బాల సర్వణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: రాష్ట్ర సమాచార కమిషనర్, సహకార శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక కెనడీ నగర్ లోని డివిజనల్ సహకార శాఖ అధికారి కార్యాలయంలో సమాచార హక్కు చట్టం 2005 పైన అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా సహకార అధికారి ఎస్వీ నాగవర్ధన హాజరై సమాచార హక్కు చట్టం ప్రాముఖ్యతను వివరించారు. జిల్లా సహకార ఆడిట్ అధికారి బ్రహ్మానంద రెడ్డి హాజరై సమాచార హక్కు చట్టం విధివిధానాలు పూర్తిగా అమలు చేయాలని సూచించారు. నగర డివిజనల్ సహకార అధికారి సురేష్ కుమార్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం నియమ నిబంధనల ప్రకారం అభ్యర్థులు కోరిన సమాచారాన్ని నిబంధనల మేరకు పరిమితులకు లోబడి ఇవ్వాలని, అలాగే వారికి సరైన సమయంలో వారు కోరిన సమాచారం ఇవ్వాలని తెలిపారు. సమాచార హక్కు చట్టం గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పూర్తి అంశాలను వివరించారు. సమావేశం అనంతరం సిబ్బంది తిరుపతి పురవీధులలో ర్యాలీ నిర్వహించి, సమాచార హక్కు చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి డివిజన్ లోని సహకార శాఖ అధికారులు, సిబ్బంది, సహకార సంఘాల సిబ్బంది, సీఈవోలు పాల్గొన్నారు.

ముగిసిన సంస్కృత వారోత్సవాలు

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం సంస్కృత వారోత్సవాల ముగింపు కార్యక్రమం వాగ్వర్ధిని పరిషత్ చెలికాని అన్నారావు సభాభవనంలో సముదాయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేరళలోని చిన్మయ్ విశ్వ విద్యాపీఠం ఛాన్సలర్ ప్రొఫెసర్ పి గీర్వాణి ముఖ్య అతిథిగా హాజరై సంస్కృత గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమానికి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఆర్ కృష్ణమూర్తి అధ్యక్షత వహించి భారతదేశ జ్ఞాన గమ్యస్థానం సంస్కృతమని అన్నారు. సంస్కృతం ద్వారానే మన భారతీయ సంస్కృతి రక్షించబడుతుంది. ప్రొఫెసర్ రజనీకాంత్ సుక్లా-డీన్, విద్యా వ్యవహారాలు, కె.వి. నారాయణరావు – రిజిస్ట్రార్, డాక్టర్ భరత్ భూషణ్ రథ్ – వాగ్వర్ధిని పరిషత్ సమన్వయకర్త, డాక్టర్ ప్రదీప్ కుమార్ బాగ్ – వాగ్వర్ధిని పరిషత్ సమన్వయకర్త పాల్గొన్నారు. అధ్యాపక సభ్యులు, బోధనేతర సిబ్బంది సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రొక్టర్ ప్రొఫెసర్ సి. రంగనాథన్, డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ ప్రొఫెసర్ ఎస్. దక్షిణమూర్తిశర్మ బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి అతిథులుగా హాజరయ్యారు. వాగ్వర్ధిని పరిషత్ అదనపు సమన్వయకర్త డాక్టర్ ఉదయన్ హెగ్డే %-% వేడుక సభాసంచాలకులుగా వ్యవహరించి కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు.

ముగిసిన చెంచురెడ్డి అంత్యక్రియలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : మాజీ ఎమ్మెల్యే, వైసీపీ సీనియర్ నేత తాటిపర్తి చెంచు రెడ్డి అంత్యక్రియలు బుధవారం ముగిశాయి. పలువురు ప్రముఖులు ఆయన పార్థీవ దేహం వద్ద నివాళులర్పించారు. అంత్యక్రియలు ముగిసే వరకు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి తన రాజకీయ గురువు అయిన చెంచు రెడ్డి పాడె మోశారు.

ఎస్వీయూ స్టేడియం పరిశీలన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, క్యాంపస్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు బుధవారం మధ్యాహ్నం నగరపాలక సంస్థ, తుడా, రెవెన్యూ, పోలీసు అధికారులతో కలసి ఎస్వీయూ స్టేడియంను నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య పరిశీలించారు. వర్షాల నేపథ్యంలో వర్షపునీటితో పోలీసు పెరేడ్ గ్రౌండ్ చిత్తడిగా మారడంతో ఎస్వీయూ స్టేడియంలో వేడుకలు నిర్వహించేందుకు నిర్ణయించారు. ముఖ్య అతిథులు, అధికారులు, అవార్డు గ్రహీతలు, స్వాతంత్ర సమరయోధులు, వారి కుటుంబ సభ్యులు కూర్చునేందుకు ప్రత్యేకంగా గ్యాలరీల ఏర్పాటుకు, అలాగే స్వాతంత్ర దినోత్సవ వేడుకలను వీక్షించేందుకు వచ్చే వారు కూర్చునేందుకు గ్యాలరీలను ఏర్పాటు చేసేందుకు పరిశీలన చేశారు. ప్రజల సందర్శనార్థం ఎగ్జిబిషన్ స్టాల్స్ ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశాలపైన అధికారులతో చర్చించారు. కమిషనర్ వెంట డీఆర్వో నరసింహులు, తుడా ఈ.ఈ. రవీంద్ర, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ. మహేష్, తదితరులు ఉన్నారు.

జగన్ శపించడంలో దిట్ట



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మాజీ ముఖ్యమంత్రి జగన్ శపించడంలో దిట్టని టీడీపీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.ఎం.ఉమేష్ రావు బుధవారం విమర్శించారు. పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఓటమి తప్పదని గ్రహించిన జగన్ అసహనంతో చంద్రబాబుపై వ్యక్తిగత దూషణలకు దిగుతున్నాడని మండిపడ్డారు. గత వైసిపి పాలనా కాలంలో జరిగిన ప్రతీ ఎన్నికల్లో రిగ్గింగ్ పాల్పడిన జగన్ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. టీడీపీ కార్యదర్శులు డా.జి.దశరధాచారి, గాలి చలపతి నాయుడు, మిన్నల్ రవి తదితరులు పాల్గొన్నారు.

56వ రోజూ నిరసన

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: రామారావుని బదిలీ చేయాలని అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు బుధవారం నాటికి 56వ రోజుకు చేరాయి. సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ రామారావుని బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.

BEFORE THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL AT PONNERI
(IN THE COURT OF IVth ADDITIONAL DISTRICT and SESSIONS JUDGE, PONNERI)
M.C.O.P.No.48 of 2023
S.Geetha and others ...Petitioners
-Vs-
Yanamala Venkata Ramanaiah and another ....Respondents
NOTICE
R-1: YANAMALA VENKATA RAMANAIAH, No.1-1, Venkateswarapuram, Nellore, Andhra Pradesh - 524 005. ...1st Respondent
Take notice that the above said MCOP No.48 of 2023 has filed by the petitioners for the compensation of the petitioner's husband and 2nd and 3rd petitioner's father and 4th and 5th petitioner's son namely R.Srinivasan was died as fatal accident on 16.08.2022. That the above MCOP is posted for respondent's appearance on 06.10.2025 at 10.15 A.M, on that day the respondent is appear in person or through his counsel, and he must be present before the Hon'ble Motor Accidents Claims Tribunal Ponneri at IVth ADDITIONAL DISTRICT and SESSIONS JUDGE, PONNERI, or otherwise the above MCOP is decided as against you by this Hon'ble Court..
V.AMMARATH GANDHI
Counsels for petitioners

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE
(SENIOR DIVISION) ::: TIRUPATI
I.A.No.238/2024
O.S.No.85 /2022
K.Dhanalakshmi ...Petitioner/Plaintiff
Vs
P.Seshavathi (DIED)rep. by her L.Rs & others. ...Respondents/Defendants
NOTICE TO THE PROPOSED PARTIES 2 AND 3
R2: P.Siva S/o P.Munikrishnaiah, R3- S.Himabindu D/o P.Munikrishnaiah, Both are residing at D.No.4-1-104, Patnool Street, Tirupati.
Please take Notice in the above petition has been posted on 15-09-2025 for your appearance. Please attend on that day before the above said Court by 10-30 A.M. either in person or through your Advocate and file your objections if any. Otherwise, the matter will be decided exparte.
P.BALARAM, B.Com.,B.L.,
M.RAMACHANDRA REDDY,
ADVOCATES – TIRUPATI
Cell No.9948156064

Before The Principal Motor Accident Claims Tribunal : Nellore
M.V.O.P.No. 203 / 2022
Maddali Sathish Babu
@ Maddali Satish Babu - Claimant
Versus
1. Kolakatla Sunil
and 3 others - Respondents
Notice
To,
R4. Pothanaboina Sudheer Babu
S/o Radhakrishna Murthy, Regd. Owner of the Mahindra Bolero bearing No.AP-26-M-4380, R/o Mambattu (V), Tada Mandal, Tirupathi District.
పై నెంబరున క్లయిమెంట్ మీపై నష్టపరిహారము కోరుతూ పై తెలిపిన కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్లో మీకు నోటీసు నిమిత్తం తే19-08-2025ది కి వాయిదా వేసియు న్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులోహాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
ఎ.వి.ఎస్.రవీంద్ర కుమార్, బి.ఎ., బి.ఎల్.,
క్లయిమెంట్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

Before The Principal Motor Accident Claims Tribunal : Nellore
M.V.O.P.No. 202 / 2022
Pavani Srinivasulu - Claimant
Versus
1. Kolakatla Sunil
and 3 others - Respondents
Notice
To,
R4. Pothanaboina Sudheer Babu
S/o Radhakrishna Murthy, Regd. Owner of the Mahindra Bolero bearing No.AP-26-M-4380, R/o Mambattu (V), Tada Mandal, Tirupathi District.
పై నెంబరున క్లయిమెంట్ మీపై నష్టపరిహారము కోరుతూ పై తెలిపిన కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్లో మీకు నోటీసు నిమిత్తం తే19-08-2025ది కి వాయిదా వేసియు న్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులోహాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
ఎ.వి.ఎస్.రవీంద్ర కుమార్, బి.ఎ., బి.ఎల్.,
క్లయిమెంట్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

Before The Principal Motor Accident Claims Tribunal : Nellore
M.V.O.P.No. 201 / 2022
Thalluri Naresh - Claimant
Versus
1. Kolakatla Sunil
and 3 others - Respondents
Notice
To,
R4. Pothanaboina Sudheer Babu
S/o Radhakrishna Murthy, Regd. Owner of the Mahindra Bolero bearing No.AP-26-M-4380, R/o Mambattu (V), Tada Mandal, Tirupathi District.
పై నెంబరున క్లయిమెంట్ మీపై నష్టపరిహారము కోరుతూ పై తెలిపిన కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్లో మీకు నోటీసు నిమిత్తం తే19-08-2025ది కి వాయిదా వేసియు న్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులోహాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
ఎ.వి.ఎస్.రవీంద్ర కుమార్, బి.ఎ., బి.ఎల్.,
క్లయిమెంట్ తరపు అడ్వకేట్, నెల్లూరు.